క్లుప్తంగా

వెంకన్నసేవలో హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది



వేంకటేశ్వరున్ని దర్శించుకుంటున్న న్యాయవాది అశ్వర్థనారాయణ

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యం గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కార్తీక సోమవారం సందర్భంగా విజయవాడ హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది (గవర్నమెంట్ ప్లీడర్) అశ్వర్థనారాయణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జమేదార్ రామలింగయ్య, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

సోమందేపల్లి: వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎకరాకు రూ.40 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు వినతి పత్రం అంజదేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దన్న, వెంకటేష్, హనుమయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట



చిత్రలింగేశ్వరస్వామి, యత్తయ్యస్వామి

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో యాదవ కులస్తులు నూతనంగా నిర్మించిన చిత్రలింగేశ్వరస్వామి, యత్తయ్య స్వాముల ఆలయ ప్రవేశం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు వేద మంత్రాలు చదివి విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కరాటే పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

హిందూపురం: ఏఎస్ గోజు ర్యూ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 3వ ఓపెన్ నేషనల్ లెవల్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో హిందూపురం కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సోమవారం కరాటే ఇన్‌స్ట్రక్టర్ సెన్సెయ్ ఫైరోజ్ మాట్లాడుతూ... కర్ణాటకలో జరిగిన కరాటే పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచారన్నారు. ఇందులో 9 బంగారు పతకాలు, 8 మంది వెండి పతకాలు, ఏడుగురు కాంస్య పతకాలు సాధించారని, వీరికి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించినట్లు తెలిపారు.

రస్తా సమస్య పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

గోరంట్ల: పూర్వ కాలం నుంచి రైతుల పొలాలకు వెళ్లే దారిని ఓ రైతు మూసివేయడంతో మిగతా రైతులంతా ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని మండల పరిధిలోని బూదిలికి చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ బూదిలి, బూదిలి తండా మధ్య 648 సర్వే నంబర్ గుండా, దాదాపు రెండు వందల మందికి చెందిన రైతుల పొలాలకు పూర్వ కాలం నుంచి దారి ఉండేదన్నారు. అయితే ఇటీవల ఓ రైతు సంబంధిత సర్వే నంబర్ పొలం కొనుగోలు చేసి రస్తా తన పట్టాలో ఉందని కంచె వేశారని వాపోయారు. దారిలేక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలిపారు. సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ రంగనాయకులకు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ భూమి కొనుగోలు చేసిన రైతుతో చర్చించి దారి వదిలేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రమాదాలకు కేరాఫ్ !

- తరచూ నెత్తురోడుతున్న 44 నంబర్ జాతీయ రహదారి
- మూడేళ్లలో 47 మంది తిరిగిరాని లోకాలకు...
- 200 మందికి పైగా గాయాలపాలైన వైనం


ప్రమాదాలకు నిలయంగా మారిన కొడికొండ చెక్‌పోస్టు


కోడూరు తోపులో మూడు రహదారులు కలిసే చోటు

హిందూపురం అర్బన్: జాతీయ రహదారి 44 అంటేనే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలే ఇందుకు కారణం. గత మూడేళ్లలో మొత్తం 25 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 47 మంది ప్రాణాలు గాల్లో కలసిపోయాయి. మరో 200 మందికి పైగా గాయాలపాలయ్యారు. అనంతపురం నుంచి కర్ణాటక సరిహద్దులోపే ఈ ప్రమాదాలన్నీ జరిగాయి. పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నా నిత్యం ఏదో ఓ ప్రాంతంలో ప్రమాదం జరుగుతూనే ఉంది.

కోడూరు తోపు యమ డేంజర్...

చిలమత్తూరు మండలం కోడూరు తోపు మలుపు వద్ద బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్లే రోడ్డు వాలుగా ఉంది. అక్కడే మలుపు ఉండటంతో ప్రమాదాలకు కారణంగా మారుతోంది. నియంత్రణకు పోలీసులు అక్కడ ఎన్ని ఏర్పాట్లు చేస్తున్నా ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. దీంతో మూడేళ్లలో ఈ ఒక్క ప్రదేశంలోనే 10 మందికి పైగా మృతి చెందారు. 30 మంది వరకూ గాయపడ్డారు. నెల రోజుల క్రితం ఓ లారీ స్కూటర్‌ను ఢీకొన్న ఘటనలో స్కూటరిస్ట్ తల తెగి పక్కన పడటం అందరినీ కలిచి వేసింది.

పాలసముద్రం మలుపు కూడా...

పాలసముద్రం మలుపు వద్ద కూడా రోడ్డు ప్రమాదాలు జరుతూనే ఉన్నాయి. వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా అక్కడ ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. హిందూపురం – కదిరి వైపు వెళ్లే వాహనాలు ఇక్కడ జాతీయ రహదారి దాటాల్సి ఉంది. అతివేగంతో వాహనదారులు వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ మూడేళ్లలో 8 మంది వరకూ మృతి చెందగా.. 28 మందికి పైగా గాయపడ్డారు. ఇక.. కొడికొండ చెక్ పోస్టులో 10 రోజుల క్రితం బస్సు డివైడర్‌కు ఢీకొన్న ప్రమాదంలో 8 మంది గాయపడ్డారు. ఇక... మిగతా ప్రాంతాల్లో ఉన్న హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో కూడా ఎంతో మంది ప్రాణాలు పోయాయి. ఆయా ఘటనల్లో ఎన్నో బాధిత కుటుంబాలు నేటికీ కోలుకోలేని పరిస్థితి ఉంది.

వంతెనలు లేకనే ప్రమాదాలు..

జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్ల దగ్గర వంతెనలు లేకపోవడంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీస్, రవాణాశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ముఖ్యంగా కొడికొండ చెక్‌పోస్టు, కోడూరు, పాలసముద్రం, పెనుకొండ వై జంక్షన్, రాప్తాడు వద్ద వంతెనలు (ఫ్లైఓవర్) లేకనే ప్రమాదాలు జరుగుతున్నట్లు తేల్చారు. కర్ణాటకలో ఎక్కడ హైవే దాటాలన్నా.. ఫ్లైఓవర్‌లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారని, ఇక్కడ కూడా వంతెనలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు చెబుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



కోడూరు తోపులో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వారంలో ఒక సారైనా ఎవరో ఒకరు ప్రమాదాల బారిన పడుతున్నారు. తోపులో ఫ్లైఓవర్ (పై వంతెన) ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు. ఇప్పటికే కలెక్టర్, పోలీస్ అధికారులకు పలుమార్లు విన్నవించాం.

– సోమశేఖర్, కోడూరు.

అధికారులతో మాట్లాడుతున్నాం



కొడికొండ, కోడూరు తోపు వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాతీయ రహదారుల అధీకృత సంస్థ అధికారులతో మాట్లాడుతున్నాం. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాం. తగిన చర్యలు తీసుకొంటాం.

– కంజాక్షన్, డీఎస్పీ హిందూపురం

నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం



వాహనదారుల నిర్లక్ష్యం, అతివేగం, రాత్రివేళ విశ్రాంతి తీసుకోకుండా నిద్ర మేల్కొని వాహనాలను నడపడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్నో అవగాహన సదస్సులు పెడుతున్నా ఎక్కువ మంది నిర్లక్ష్యంగానే వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కేసులు నమోదు చేసి ఫైన్లు వేస్తున్నా మార్పు రావడం లేదు. పిల్లలకు ఇళ్ల వద్ద తల్లితండ్రులు కూడా వాహనాలు ఇచ్చే సమయంలో ఓ నిమిషం ఆలోచించాలి.

– కరుణాసాగర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, హిందూపురం

సమస్యల పరిష్కారానికే 'స్పందన'


పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పెనుకొండ సబ్‌కలెక్టర్ కె.కార్తీక్

రొళ్ల: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కంచడానికే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఆవరణలో డివిజన్‌స్థాయి అధికారులతో కలిసి సబ్‌కలెక్టర్ కె.కార్తీక్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజలు కూడా తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవాలన్నారు. అనంతరం భూ సమస్యలకు సంబంధించి 48 అర్జీలు, ఇతరాత్ర వాటికి సంబంధించిన 16 అర్జీలు మొత్తం 64 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు.

ఇసుక రవాణకు అనుమతించండి

మండల వ్యాప్తంగా ప్రభుత్వ భవనాలతో పాటు ఇతరాత్ర భవనాలు నిర్మాణానికి అవసరమైన ఇసుక కొరత ఉన్నందున స్థానికంగానే ఇసుక రవాణ చేసుకునేందుకు అనుమతి కల్పించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర తదితరులు సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు అర్జీ అందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించడానికి చొరవ తీసుకుంటామని సబ్‌కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మడకశిర పంచాయతీరాజ్ డీఈ మల్లికార్జున, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ ఆజాద్, డివిజన్‌స్థాయి అధికారులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అగళి: మండల పరిధిలోని కోడిపల్లి సచివాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ రేణుక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

హొన్నంపల్లిలో...

పరిగి: మండలంలోని హొన్నంపల్లిలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కరికెరలో..

గుడిబండ: మండల పరిధిలోని కరికెర సచివాలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారే గౌడ్ తెలిపారు.

హలుకూరులో...

అమరాపురం: మండలంలోని హలుకూరు సచివాలయం – 2 పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వలంటీర్లు హాజరుకావాలన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఉదుగూరు గ్రామ సచివాలయం దగ్గర కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

ఛత్రంలో...

మడకశిరరూరల్: మండలంలోని ఛత్రం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గంగంపల్లిలో...

గోరంట్ల: మండల పరిధిలోని గంగంపల్లి గ్రామ పంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, వలంటీర్లు, గృహసారథులు తప్పక హాజరు కావాలని కోరారు.

30న వాహనాల వేలం

హిందూపురం టౌన్: సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 30న ఉదయం 11 గంటలకు సెబ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ స్వర్ణలత పేర్కొన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.


పరిగి: బీరలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


పెనుకొండ: కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు


హిందూపురం మండలం కిరికెర బసనపల్లి శివాలయం ఆవరణలో వెలసిన శివుడు

ఆరనీకుమా ఈ దీపం..

హర హర మహాదేవ శంభో శంకర అన్న నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక దీపాలను వెలిగిస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి బృందం


అగళి మండలం కోడిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో..


రొద్దం: పెన్నానదిలో దీపాలు వెలగిస్తున్న మహిళలు


హిందూపురం: త్యాగరాజనగర్‌లోని రామాలయంలో..


రొళ్ల మండలం జీరిగేపల్లిలో అలంకరణలో అమ్మాజీ దేవతలు


లేపాక్షి: అలంకరణలో వీరభద్రస్వామి

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారు

మడకశిరరూరల్: మండలంలోని టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మి మోస పోవద్దని సర్పంచ్ కరియన్న తెలిపారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని హరేసముద్రం సచివాలయం ఆవరణలో హరేసముద్రం, గొల్లపల్లి గ్రామాలకు చెందిన 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సర్పంచ్ కరియన్న వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు ప్రారంభం

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు సోమవారం ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. డిసెంబర్ 13వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్ కింద నమోదు చేసుకునే ప్రక్రియ ప్రారంభం అయిందన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్‌తో పాటు ఖోఖో, బ్యాడ్మింటన్ ఇతరాత్ర పోటీలను నిర్వహిస్తున్నామని, 15 ఏళ్ల నిండిన యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రేపు బహిరంగ వేలం

హిందూపురం టౌన్: మున్సిపల్ న్యూ షాపింగ్ కాంప్లెక్స్, వెజిటేబుల్ మార్కెట్ వద్ద ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు ఈ నెల 29న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించినప్పటికీ అనుకున్న స్థాయిలో ఆదాయం మున్సిపాలిటీకి రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేశామన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భవనం వద్ద వేప చెట్టు నుంచి గాంధీ చౌక్ వరకూ, అలాగే కాంప్లెక్స్ పడమర వైపు ఉన్న ఖాళీ స్థలంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని సూచించారు.

ఎయిడ్స్‌పై అవగాహన


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాలతో సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చైతన్య రూరల్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే వారోత్సవాల్లో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ తిప్పేస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ఎయిడ్స్ బాధితులను చిన్నచూపు చూడటం, సమాజం నుంచి దూరంగా పెట్టడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ విమల, ల్యాబ్ టెక్నీషియన్ సరిత, చైతన్య సంస్థ ఎంతపి నవీన్‌కుమార్, ఏఎన్ఎం శ్రీలక్ష్మీ, భారతి, జయమ్మ, లలిత, ముంతాజ్, గాయత్రి, సన్నీరమ్మలు పాల్గొన్నారు.

వేడుకగా కనకదాస జయంతి


కనకదాస జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని కంబాలపల్లిలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతి ఉత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు మోసి మొక్కలు తీర్చుకున్నారు. గొరవయ్యల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సర్పంచ్ మంజు, కురుబలు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ


అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

హిందూపురం టౌన్: హైదరాబాద్‌లో ఈ నెల 26న సిప్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో హిందూపురానికి చెందిన సిప్ అబాకస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సిప్ అబాకస్ నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొనగా 23 మంది వివిధ స్థాయిల్లో పతకాలు సాధించినట్లు అబాకస్ నిర్వాహకురాలు మాలతి సోమవారం తెలిపారు. వారికి హ్యూమన్ రైట్స్ కమిషన్ సీఈఓ డాక్టర్ గార్గ్, సిప్ అకాడమీ ఎండీ దినేష్ విక్టర్‌లు బహుమతులు ప్రదానం చేసినట్లు చెప్పారు.

బ్రూస్‌లీకి ఘన నివాళి


బ్రూస్ లీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఇండియన్ మార్షల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ యోధుడు బ్రూస్ లీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రూస్ లీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కరాటే గ్రాండ్ మాస్టర్ రామచంద్ర మాట్లాడుతూ బ్రూస్ లీని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు.